# "ఈ పాపంలో మీ భాగమెంత?"

-సిహెచ్.వి.బృందావనరావు

"బస్ టైము కావస్తున్నది. బస్టాండు దాకా వెళ్లేదేమైనా వుందా, లేదా" అడిగింది ఝాన్సీ జగదీశ్వర్రావును.

"పోతున్నా పోతున్నా. ఇంకా అరగంట టైముంది గదా బస్‌కు" అన్నాడు జగదీశ్వర్రావు. "నిజానికి నీకన్నా ఎక్కువ తొందరగా వుంది నాకు" అన్నాడు చెప్పులు వేసుకుంటూ.

జగదీశ్వరరావూ ఝాన్సీ ఆ పల్లెలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని కాలం వెళ్ల బుచ్చుతున్నారు. మూడెకరాల మాగాణీ వుంది వాండ్లకు. స్వయంగా వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా కాలం గడుపుతున్నారు.

వాళ్ళకు ఒకే కూతురు అరుణ. ఎనిమిదేండ్లయింది అరుణకు పెండ్లయి. ఆమె భర్త సిటీలో ఏదో ఆఫీసులో సీనియర్ గుమస్తా. ఒక అబ్బాయి ఒక అమ్మాయి అరుణకు. చాలారోజుల తర్వాత తల్లిదండ్రులను చూడాలని ఆ పల్లెకు వస్తున్నది. కాన్వెంటుల్లో చదివే పిల్లలకు శలవలాంటివేమీ ఉండవు. అయినా వాండ్లను బ్రతిమలాడి రెండ్రోజుల్లో తీసుకువస్తానని చెప్పి పిల్లల్తో వస్తున్నది. కూతురు వస్తున్నదన్న సంతోషంతో హడావుడిగా వున్నారు ఝాన్సీ జగదీశ్వర్రావులు. జగదీశ్వర్రావుకు యాభై అయిదేండ్లు దాటినై. కాయకష్టం చేసే శరీరం కావడాన వయసు తక్కువగా కన్పిస్తాడు.

ఝాన్సీ జగదీశ్వర్‌లది ప్రేమ వివాహం. కులాంతరం కూడా. దాదాపు ముప్పయ్యేళ్ల క్రితం వాండ్లకు పెళ్లయింది. ఆదర్శ వివాహం చేసుకున్నారు.

బస్ దిగగానే 'తాతయ్య' అంటూ జగదీశ్వర్రావును చుట్టేశారు శిరీషా వినోద్. శిరీషాకు ఇంకా ఆరో ఏడు రాలేదు. వినోద్‌కు ఏడేళ్లు.

"బాగున్నావామ్మా" కూతుర్ని చూడగానే ఆనందంతో అడిగాడు జగదీశ్వర్రావు పిల్లల్ని రెండు చేతుల్తో దగ్గరకు తీసుకొని.

'నువ్వెట్లా వున్నావు నాన్నా. అమ్మ బాగుందా!' ఆప్యాయంగా అడిగింది అరుణ.

"బాగానే వున్నామమ్మా. ఒరే వినోద్ మీరిద్దరూ రోజూ బడికి పోతున్నారా. బాగా చదువుకుంటున్నారా" అడిగాడు తాతయ్య.

"ఓ" అంటూ జవాబిచ్చారు పిల్లలు.

సూట్‌కేసు జగదీశ్వర్రావు తీసుకున్నాడు. సంచీ అరుణ భుజానికి తగిలించు కున్నది. ఇంటికి బయల్దేరారు.

"అమ్మా" అంటూ తల్లిని కౌగిలించుకున్నది అరుణ ఇంటికి చేరగానే.

కూతుర్ని పిల్లల్నూ చూడగానే ఎంతో ఆప్యాయంగా పలకరించి "ఏంది తల్లీ ఇంత చిక్కిపోయావు" అంది ఝాన్సీ.

అరుణ నవ్వింది. "మీ అల్లుడు నేను లావయి పోతున్నానంటుంటే నువ్వేంటి. నేను చిక్కిపోయానంటావు" అంది.

"పదమ్మా. స్నానాలవీ చేసి కొంచెం ఎంగిలి పడండి. పొద్దున్న టిఫినైనా తిన్నారో లేదో" అన్నాడు జగదీశ్వరరావు.

"ఏమర్రా పిల్లలూ ఏం చదువుతున్నారు మీరు"

"నేను ఫస్ట్ క్లాస్" అన్నాడు వినోద్.

"నేను ఎల్‌కేజీ" వచ్చీరాని ముద్దుపలుకులతో చెప్పింది శిరీష.

"తెలుగు పద్యాలేమైనా నేర్చుకున్నారా" అడిగాడు తాత. పిల్లలు మొహమొహాలు చూసుకున్నారు.

"అంటే ఏంటి తాతయ్యా" అడిగారు పిల్లలు.

"వాళ్ళు ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేరారు నాన్నా. తెలుగు ఏం చెపుతారు వాండ్లు. బోలెడు డబ్బు డొనేషన్ కడితే ఆ స్కూల్లో అడ్మిషన్ దొరికింది" అంది అరుణ.

"సరేనమ్మా, వాళ్ళకు ఇంట్లోనన్నా సుమతి శతకం వేమన శతకం, పద్యాలు చెప్పవా" అడిగాడు జగదీశ్వరరావు.

"ఇప్పుడవి రాకపోతే ఏం లే నాన్నా" అంది అరుణ.

"అట్లంటే ఎట్టమ్మా. మన పిల్లలకు మన భాషలో కనీసం సాధారణ జ్ఞానం లేకపోతే ఎలా. ఇప్పుడు నేర్చుకున్నవే ఎల్లకాలం గుర్తుండి పోతాయి. పెద్దయ్యే కొలదీ ఎలాగూ లెక్కలు, కంప్యూటర్లు తప్పవు. ఇప్పటి వయసులోనే వాండ్లకు తల్లిదండ్రులు మన భాషా, మన పద్యాలే బోధించాలి" అన్నాడు జగదీశ్వర్రావు.

"పొద్దున్నే ఆఫీసుకెళితే రాత్రి ఏడింటిగ్గాని ఆయన రాడు. అప్పటికి పిల్లలు హోం వర్కు చేసి అలిసిపోయి

వుంటారు. నాకేమో ఇంటిపనితోనే సరిపోతుంది. వాళ్ళు స్కూల్లో నేర్చుకున్నవి చాలవా ఏమిటి?" అంది అరుణ.

"సరేలే తల్లీ ఇక పద స్నానం చేద్దూగాని" అన్నది ఝాన్సీ. పిల్లల్తో ముచ్చట్లలో పడ్డాడు జగదీశ్వరరావు.

సాయంకాలం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుం టుండగా తన మెళ్లోంచి బంగారపు గొలుసు తీసి చూపించింది అరుణ, తల్లికి 'ఇది ఎట్లా వుందమ్మా' అని అడుగుతూ.

"చాలా బాగుంది. ఎప్పుడు చేయించుకున్నావు"

"పది రోజులయిందిలే. మీ అల్లుడు గారు ఏదో డబ్బొచ్చిందని చేయించారు" అంది అరుణ.

"బాగా ఖరీదైంది లాగుందే. ఎంతయిందేమిటి?"

"ముప్పై వేల చిల్లరయింది".

"అంత డబ్బెక్కడిదమ్మా ఒకేసారి" తల్లి అడిగింది.

"ఆయన ఆఫీసులో చాలా ముఖ్యమైన సీటులో వున్నాడమ్మా. పని చేయించుకోడానికి ఎవరెవరో వస్తుం టారు. వాళ్ళ పనయితే ఏదో ముట్ట చెబుతారు గదా" అంది అరుణ. "అందుకే ఆ సీట్లో ఆయన బాగా సంపా దించుకుంటున్నాడని మిగతా వాళ్ళకు కడుపు మంట కూడా" అంది. ఝాన్సీ, జగదీశ్వర్రావూ ఒకర్నొకరు చూసుకున్నారు.

"అయితే రాజేశ్వరరావు లంచాలు తీసుకుంటాడా" అని అడిగాడు జగదీశ్వర్రావు.

"ఇప్పుడు తీసుకోంది ఎవరు నాన్నా. దేశమంతా దాని మీదనే నడుస్తున్నప్పుడు మనం తీసుకుంటే తప్పేంది. అయినా నీవన్నీ గాంధీకాలం నాటి చాద స్తాలు" అంది అరుణ. "ఐనా మీకు జీతం బాగానే వస్తున్నది. చిన్న సంసారం. ఎక్కువ ఖర్చులు కూడా లేవు. ఇంకా కక్కుర్తి పడడం ఎందుకమ్మా" అన్నాడు తండ్రి.

"అవకాశం ఉన్నప్పుడు కాకపోతే ఇంకెప్పుడు వీలవుతుంది నాన్నా ఎల్లకాలం అదే సీట్లో ఉండక పోవచ్చు. పిల్లలు ఎదిగి వస్తున్నారు. వాళ్ళ కోసమైనా నాలుగురాళ్లు వెనకేసుకోవాలా వద్దా" అంది అరుణ.

"అవినీతి అనేది భయంకరమైన జాడ్యం. మనిషిని నైతికంగా హీనుణ్ణి చేస్తుందది. నీవు భార్యగా, నీ భర్త లాంటి జాడ్యానికి బలికాకుండా చూసుకోవాలమ్మా" అనునయంగా చెప్పడానికి ప్రయత్నించాడు జగదీ శ్వరరావు.

"నీవు ఇంకా ఏ కాలంలో వున్నావు నాన్నా - అమ్మ పెట్టా పెట్టదు అన్నట్టు" విసుగ్గా అంది అరుణ.

కూతురి మాటలకు బాధ పడ్డాడు జగదీశ్వరరావు.

"ఏం. ఇంకా ఏం పెట్టాలి నీకు. ఎంఏ దాకా చదువు చెప్పించాను. ఉద్యోగస్తుడైన వాడికిచ్చి పెండ్లి చేశాను. పండక్కో పబ్బానికో వచ్చినప్పుడు నీకు చీరెసారె తృప్తిగానే ఇస్తున్నాను. ఇంకా ఏమివ్వాల నీకు" కొంచెం కోపంగా అడిగాడు తండ్రి.

"ఒక్క పైసా ఐనా కట్నం ఇవ్వకుండా చేశావు గదా పెళ్లి" అంది ఈసడింపుగా అరుణ.

"పెళ్లయిన ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు కట్నం ఇవ్వలేదని దెప్పుతున్నావా నన్ను. నువ్వు ఆడపిల్లవై ఉంది కట్నం ఇవ్వనందుకు సంతోషించాల్సింది పోయి కట్నమివ్వ లేదని తప్పు పడుతున్నావా నన్ను".

"ఫలానా ఆడపిల్ల ఇంత కట్నం తెచ్చిందని గొప్పగా చెప్పుకుంటారు. అదే కట్నం తేని పిల్లను హీనంగా చూస్తారు జనం"

"ఎవరమ్మా ఆ జనం. ఏది మంచి ఏదిచెడు అనే విచక్షణ లేని నీలాంటి వాళ్లే గదా ఆ జనం. నువ్వు ఎంఏ చదివావు. ఏది తగునో ఏది తగదో నీవు నిర్ణ యించుకోలేవా. ఈ దిక్కుమాలిన జనాన్ని చూశా నువ్వు నేర్చుకునేది. ఇప్పుడు గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లు నువ్వు నాకు నీతులు చెప్పబాకు" కోపంగా అని లేచి పోయినాడు జగదీశ్వర్రావు.

"అసలు నువ్వు మా పిల్లవేనా అనే అనుమానం వస్తుంటుందే అమ్మాయి" అంది కూతుర్తో ఝాన్సీ.

"నువ్వు కూడానా అమ్మా" అంది అరుణ.

"కాకపోతే ఏమిటి. మీ నాన్న అభిప్రాయాలు నీకు తెలీదా. అసలు మా ఇద్దరి పెండ్లి ఎలా జరిగిందో నువ్వు వినలేదా. చదవేస్తే ఉన్న మతిపోయినట్లు - మేము వెనకటి తరం వాండ్లం ఇట్లాంటి పట్టింపులు పెట్టుకుంటే సరిదిద్దాల్సింది పోయి నువ్వు మమ్మల్నే తప్పు పడుతున్నావా" అంది ఝాన్సీ.

పిల్లలు ఆడుకొని వచ్చారు. వాండ్లను సర్దుకోడంలో మునిగి పోయింది అరుణ.

వసారాలోకి వచ్చి ఇంకా మూతి బిగించుకొని వున్న భర్తను చూసింది ఝాన్సీ.

"ఇంకలేచి సాన్నం చేయగూడదా" అంది.

"అమ్మాయి ఏంది ఇట్లా మారిపోయింది" అన్నాడు జగదీశ్వర్రావు.

"డబ్బండీ డబ్బు. సులభంగా వచ్చే లంచాల డబ్బుకు ఆశపడి యుక్తాయుక్తాలు మరచిపోతారు

మనుషులు".

"అల్లుడు లంచాలమారి అయినాడంటే మనసుకు ఎంత అసహ్యంగా వుందో తెలుసా"

"పోనీండి వాళ్ళ ఖర్మ ఎట్లా వుంటే అట్లా జరుగు తుంది".

"అదేమిటి నువ్వు చిత్రంగా మాట్లాడతావు. ఇందులో ఖర్మ ఏముంది. అవినీతి అనేది పాప పుణ్యాలకూ ఖర్మకూ విధికీ సంబంధించింది కాదు. చిత్తశుద్ధికీ మనిషి వ్యక్తిత్వానికీ సంబంధించింది - ఇంతకూ అమ్మాయి ఏమి కావాలంటుంది".

"ఇంకేముంది. మన మూడెకరాలూ అమ్మి, డబ్బులు వాళ్ళకిచ్చేసి, వాళ్ళింట్లో వాళ్ళ దయాధర్మం మీద బ్రతకమని"

"మన తదనంతరం ఇది ఎలాగూ వాళ్ళదే కదా" అన్నాడు జగదీశ్వర్రావు.

"వాళ్ళు అప్పటిదాకా కూడా ఆగ గలిగేట్టు లేరు" అంది ఝాన్సీ.

ooo

అరుణ భర్తకు ప్రమోషన్లు వచ్చి పెద్దాఫీసరయినాడు. వినోద్ బి.టెక్ పూర్తి చేసి ఎంటెక్ ముగించబోతున్నాడు. కాంపస్ సెలెక్షన్లో బెంగుళూరులోని ఓ మల్టి నేషనల్ కంపెనీ మంచి ఉద్యోగం ఇవ్వజూపింది. శిరీష ఎంఎస్సీ పూర్తి చేసింది. ఆమెకు సంబంధాలు చూస్తున్నారు అరుణా రాజేశ్వర్రావు.

జగదీశ్వర్రావూ ఝాన్సీలు పల్లెలోనే వున్నారు వ్యవసాయం చూసుకుంటూ. వ్యవసాయం ఇప్పుడే మీ సౌకర్యంగా లేదు. పల్లెల్లో చాలామంది జనం వ్యవసాయం తగ్గించి వేశారు. చాలామంది రైతులు పొలాలమ్ముకొని సిటీలు చేరారు. పిల్లల చదువుల నెపంతో. కొంతమంది తమ పొలాలను, చేపల చెరువులుగా, రొయ్యల చెరువులుగా మార్చి వేశారు. దాని ఫలితంగా మిగిలిన వ్యవసాయ భూములు దెబ్బ తిన్నాయి. విత్తనాల్లో కల్తీ, పురుగు మందుల్లో కల్తీ నీటి వనరులు అస్తవ్యస్తంగా వున్నాయి. పంట దిగుబడి తగ్గిపోయింది. వచ్చిన పంటకూ అమ్మకానికీ మధ్య దళారీల పెత్తనాలు ఎక్కువయినాయి. వ్యవసాయం ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదు. అయినా జగదీశ్వర్రావు మా ఇద్దరి కడుపులకూ ఎంత కావాల్లే అనే భావంతో వ్యవసాయం వదల్లేక పుట్టిపెరిగిన వూరు వదల్లేక అలానే లాగిస్తున్నాడు. ఝాన్సీ ఆరోగ్యం అంతంత మాత్రంగానే వున్నది. మొదటి నుండీ కష్టపడ్డ శరీరం కావడంతో

## మిత్రులారా వెళ్ళిపోతున్నాను'

మిత్రులారా! నన్ను మన్నించండి!
మీతో పంచుకొన్న ఋణానుబంధం
తెంచుకొని వెళ్ళిపోతున్నాను!
నేను వచ్చిన రోజు నాకెంత ఘనంగా స్వాగతం
పలికారో బాగా గుర్తుంది!
నామీద ఎన్నో ఆశలతో తీయని ఊహలు అల్లుకొన్నారు.
నన్నొక బంధంగా ముడివేసుకొన్నారు.
కొందరికి మంచి చేశాను - మరికొందరికి ఆత్మవంచన మిగిల్చాను.
కొందరికి దుఃఖం -కొందరికి సుఖసంతోషాలు పంచాను.
కొన్ని జంటలు విడిపోతుంటే - మరికొన్ని జంటల్ని
ఒక్కటిగా చేశాను.
అన్యాయమో, అధర్మమో నాకు తెలియదు గాని
నే చేసిన తప్పుల్ని క్షమించి, నన్ను మన్నించండి!
పసిపిల్లలపై అత్యాచారం చేసి హతమార్చిన వారికి
సైతం క్షమాభిక్ష పెడుతున్నారు.
రోజూ జరిగే మానభంగాలు, మారణ హోమాలు
రాజకీయ హత్యలు, దోపిడీలు, దొంగతనాలు
యాక్సిడెంట్లు, మర్డర్లు, బ్యాంకు దోపిడీలు
అవినీతి, లంచగొండితనంతో ప్రజలు
పరుగుల ప్రవాహంలో దగాపడిన వారికే శిక్షలు
బడా బాబుల దళారులెందరికో రక్షణలు
సునామీలు, భూకంపాలు, వరదలు, తుఫానులు
సృష్టించి ప్రాణాలతో చెలగాటమాడింది నేనుగాను
అంతా నేనేనని భ్రమపడతారు.
కాలం సృష్టించిన కల్పనలో ఒక భాగాన్ని
నేను సైతం కాల విభజనంలో చిన్న కాలాన్ని
అణువులో అణువుని పరమాణువుని
కాలగర్భంలో కలిసిపోయే శిథిల జ్ఞాపకాన్ని
మంచిని మధురంగా దాచుకోండి
చెడుని ఒక పీడకలగా మరచిపోండి
ఎప్పుడైనా గుర్తుకు వస్తే ఒకసారి నన్ను మననం
చేసుకొంటారని / కన్నీళ్ళతో ప్రాధేయపడుతున్నాను.
నా ఉద్యోగ ధర్మం నెరవేరింది. నేను నా సీటు దిగిపోక
తప్పదు. / నా స్థానంలో మరో వేకెన్సీకి చోటివ్వండి.
కాలం చేసిన రికమండేషన్‌కు అడ్డుచెప్పే అధికారం
ఎవ్వరికీ లేదు. / మిత్రులారా వెళ్ళిపోతున్నాను.
మీరు చూపించిన ఆదరాభిమానాలకు ధన్యవాదాలు
నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకొని
రేపటి నేస్తానికి స్వాగతం పలకండి. / నా తప్పులన్నీ
వేలెత్తి చూపి, నా మీద అభాండాలు వేయక
నన్ను హర్షిస్తారని ఆశిస్తూ సెలవు తీసుకొంటున్నాను
మిత్రులారా! రేపటి ఆగమనానికి పురోగమించండి!

-తాటికోల పద్మావతి

జగదీశ్వర్రావు మీద వయస్సు ప్రభావం అంత ఎక్కువగా లేదు. అల్లుడి దగ్గరి నుంచి ఫోను. శిరీషకు సంబంధం కుదిరిందని. అత్త మామల్నిద్దర్నీ నాల్రోజులు ముందుగా రమ్మనీను ఝూన్సీ జగదీశ్వర్రావులు సంతోషించారు.

శిరీష పెండ్లి కోలాహలంగా జరిగింది. వరుడు సాఫ్ట్ వేర్ ఇంజనీరు. నాలుగు లక్షల కట్నం. అరుణా రాజేశ్వర్రావులు పెండ్లి ఆర్భాటంగా చేశారు. బ్రహ్మాండంగా ఖర్చుపెట్టారు. చదివింపుల రూపంలో తన క్రింది ఉద్యోగుల దగ్గర్నుంచి అంతే బ్రహ్మాండంగా రాబట్టుకున్నాడు రాజేశ్వర్రావు.

పెండ్లి అయింతర్వాత తిరిగి తమ పల్లెకు బయల్దేరారు ఝూన్సీ జగద్వీశర్రావులు.

"మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి నాన్నా" అంది అరుణ ప్రేమతో "నువ్వు కూడా అమ్మా" అంది తల్లితో.

"మీరిద్దరూ ఆ పల్లెలో ఎందుకు మామగారూ. ఆ కొంచెం భూమి అమ్మేసి ఇక ఇక్కడికి రావచ్చు గదా" అన్నాడు రాజేశ్వర్రావు.

"ఏదో ఇంకా ఒంట్లో ఓపిక వుందిగదా నాయనా. ముందు ముందు ఎలా వుంటుందో చూదాం" అన్నాడు జగద్వీశర్రరావు.

జగదీశ్వర్రావు అడక్కుండా ఉండలేక పోయాడు. "శిరీష అందంగా బంగారు బొమ్మలాగా వుంటుంది. ఎమ్మెస్సీ దాకా చదువుకుంది. ఏ వరుడైనా ఎగిరి గంతేసి చేసుకోవలసిన అమ్మాయి. మరి ఆమెకు కట్నం ఇవ్వాల్సిందేనా మీరు" అని.

"ఇవన్నీ మామూలే తాతయ్యా" అంది శిరీష.

"కట్నం అనేది స్టేటస్ సింబల్‌లే తాతయ్యా. ఇప్పుడు అది లేకుండా పెండిండ్లు జరగుతున్నాయా" అన్నాడు వినోద్.

"యూ టూ బ్రూటస్" అన్నట్లు చూశాడు వినోద్ వైపు జగదీశ్వర్రావు. "అయితే నువ్వూ తీసుకుంటావా" అని అడిగాడు.

"వినోద్‌కు సంబంధాలు వస్తున్నాయి. ఐదు లక్షల దాకా ఇస్తామంటున్నారు. కారు కూడా రాబట్టాలి" గర్వంగా అంది అరుణ.

ఏం మాట్లాడలేదు జగదీశ్వర్రావు. "సరే మేం వెళ్లొస్తా నాయనా" అని బయలు దేరారు వృద్ధ దంపతులిద్దరూ.

○○○

ఓ సంవత్సరం గడిచిపోయింది. ఉన్నట్టుండి ఒక రోజు కూతురు అల్లుడు దగ్గర్నించి ఫోను. శిరీష ఆరోగ్యం సరిగా లేదు. ఆస్పత్రిలో జాయిన్ చేశారు. వెంటనే రమ్మని.

కంగారు పడిపొయ్యారు ముసలివాళ్ళిద్దరూ "అసలు ఏమయింది బాబూ, ఆరోగ్యం బాగాలేక పోవడమేంటి" అని ఫోనులో ఆదుర్దాగా అడిగాడు జగదీశ్వరావు.

"ముందు మీర్రాండి" అన్నాడు రాజేశ్వర్రావు ఫోను

## 'తోరా' నానీలు

**శాం**తం / పురోభివృద్ధిలోకి
కోపం / పతనంలోకి
మానవులు
మూర్ఖులని
కొట్టేసిన చెట్లు
మాట్లాడుకుంటున్నాయి

పొద్దున్నే
జీవన పోరాటానికి
సిద్ధమవుతున్నారు
వీధిబాలలు

క్రొత్తజీవిని
సృష్టించగలిగినా
చావును మాత్రం
ఆపలేనిది విజ్ఞానం

లోకంలో
అన్నీ కలుషితమే
ఒక్క
అమ్మ ప్రేమ తప్ప

తల్లి
సీరియళ్లు చూస్తూ ఏడిస్తే
పిల్లలు
పుస్తకాలు మోయలేక

అర్ధరాత్రి
అర్ధనగ్న నృత్యాలు
ఇదే
హైదరాబాదీ అభివృద్ధి

తనకు
విముక్తి కలిగించమని
ఓజోన్ పొర
ప్రార్థిస్తోంది

**-తోకల రాజేశం**

పెట్టేస్తూ, ఏడుస్తున్నట్టు, ఎక్కిళ్ళు వినిపించాయి ఫోనులో. మరీ గాభరా పడిపోయినారు ముసలివాళ్ళిద్దరూ. బట్టలూ అవీ సర్దుకొని వెంటనే బయల్దేరారు. నేరుగా ఆస్పత్రికి పోయినారు.

బీభత్సంగా వుంది పరిస్థితి. శిరీష వళ్లంతా కాలి పోయిన స్థితిలో ఆస్పత్రిలో చేర్చారు. గడియో, అరగడియో అన్నట్లున్నది అనుకున్నారు గాని చనిపోయి గంటైంది. బెడ్‌మీద భయంకరంగా కాలిపోయిన శరీరంతో వున్న శిరీష మృతదేహాన్ని చూడగానే గుండె లవిసి పోయినాయి అందరికీ. అరుణా రాజేశ్వర్రావు హృదయవిదారకంగా రోదిస్తున్నారు. తల్లీతండ్రి రాగానే "అమ్మా" అని కరుచుకొని శోకాలు తీస్తున్నది అరుణ.

"అసలేమయిందమ్మా" అన్నాడు జగదీశ్వర్రావు.

"నా కూతుర్ని కాల్చిచంపేశారు" అంటూ గుండెలు బాదుకుని ఏడ్చింది అరుణ.

ప్రక్కనే నిలబడి వున్న వ్యక్తి చెప్పాడు. "ఏముందీ మామూలు కథే. కట్నం చావు. కట్నం ఇంకా తెమ్మని అత్తా మొగుడు కలిసి కిరసనాయిలు పోసి కాల్చి చంపినట్టున్నారు"

గుండెలవిసిపోయినాయి జగదీశ్వర్రావుకు. ముద్దులు మూటగట్టే పిల్ల. తన గుండెల మీద ఆడుకున్న పిల్ల. క్లాసులో అన్నిట్లో మంచిమార్కులు తెచ్చుకున్న పిల్ల. అంగరంగ వైభవంగా పెండ్లి చేసి అత్తవారింటికి పంపి ఏడాది గూడా కాలేదు. కాలిన మాంసం ముద్దయి ఆస్పత్రి బెడ్ మీద పడుండే సరికి చూడడం హృదయ విదారకంగా వుంది. ఝాన్సీ అరుణ ఒకర్ని కరచుకొని ఒకరు ఏడుస్తున్నారు. రాజేశ్వరరావు కళ్ళ నీళ్లతో మొహం చేతుల్లో పెట్టుకుని వెక్కుతున్నాడు. వినోద్ మాత్రం శోకం కోపం కలిసిన స్థితిలో పచారు చేస్తున్నాడు. పోలీసులు కూడా అక్కడే వున్నారు.

"ఆ వెధవలను ఊరికే వదుల్తానా. పోలీసు రిపోర్టు ఇచ్చి అరెస్టు చేయించక ఊరుకుంటానా" కోపంగా అరిచాడు వినోద్.

"అంతకంతకూ అనుభవించేట్లు చేస్తాను చూడు" ఆవేశంతో బిగ్గరగా అన్నాడు రాజేశ్వర్రావు.

"ఏమి చేసినా నా తల్లి తిరిగి వస్తుందా" అని వెక్కివెక్కి ఏడ్చింది అరుణ.

దహనకాండా అదీ అయిపోయి, ఇంటికి వచ్చి ఏడుస్తూ నట్టింట్లో కూర్చున్నారు అందరూ.

"ముద్దుల మూటగట్టే పిల్ల. అప్పుడే నూరేండ్లు నిండాయి నా తల్లికి" అని ఏడ్చింది అరుణ.

"ఈ పాపంలో నీకూ, నీ భర్తకూ, నీ కొడుక్కూ ఏమీ భాగం లేదా అమ్మా" అన్నాడు జగదీశ్వర్రావు కండ్ల నీళ్లతోనే. బిత్తరపోయి తలెత్తిచూశారు ముగ్గురూ.

"నీ భర్త నెక్లెస్ చేయిస్తుంటే మంచి సీటులో వుండి డబ్బు సంపాదించి నగలు చేయిస్తున్నాడని సంతోషించావే గాని అతనికి డబ్బులు ధారపోసిన వారు ఎంత బాధపడ్డారో ఆలోచించావా. మన జీతం మనకు సరిపోతుంది లంచాలు తీసుకోవద్దని చెప్పగలిగావా! నీ కొడుక్కు ఐదు లక్షలు వస్తుంటే చాలవని కారుతో సహా గుంజాలనుకున్నావే అప్పుడు నీకేమీ తప్పనిపించ లేదా అమ్మా. ఇంజనీరై స్వయంగా సంపాదించగల్గిన నీ కొడుకు కట్నం స్టేటస్ సింబల్ అని అంటుంటే పొంగి పొయ్యావు గాని పరాయివాళ్ళ స్వేదం సొమ్ముతో బ్రతికే బ్రతుకు పంది బ్రతుకన్నా హీన మయిందని చెప్పగలిగావా. వొరే వినోద్, నువ్వు కట్నం తీసుకోవడం స్టేటస్ సింబల్ అని అనుకొన్నట్టుగానే శిరీష మొగుడు కూడ తన స్టేటస్‌కు మీ నాయన ఇచ్చిన కట్నం సరిపోలేదనుకుంటే అది తప్పని వాదించే హక్కు నీకెక్కడిదిరా. ఎమ్మెస్సీ చదివి తన కాళ్ల మీద తాను నిలబడగలిగిన సమర్థతను సంపాదించుకున్న శిరీష "ఇవన్నీ మామూలే" అని అంది గాని తనను పెండ్లి చేసుకోవడానికి కట్నం అడిగిన వెధవను మొహం మీద ఛీ కొట్టగలిగిందా. కనీసం ఇంకా కట్నం తెమ్మని పీడించే వెధవ మొఖాన తాళి బొట్టు విసిరి కొట్టిరాక, కిరసనాయిలు పోసి కాలబెట్టిందాకా వాడి పాదాల దగ్గర పడి వుండటానికి అసలు దానికి ఆత్మగౌరవ మంటూ వుందా. మీ పిల్లలకే మీరు లక్షలు కుమ్మరించి చదువైతే చెప్పించారు గాని విచక్షణా సంస్కారమూ నేర్పలేక పొయ్యారు అందరూ చేస్తున్నారని మీరుచేశారు గాని. అందరంటే ఎవరయ్యా! మీరే గదా. మాలాంటి పాతకాలం మనుషులు పొరపాట్లు చేస్తే తప్పని మంద లించాల్సిన మీ తరమే ఇంత ఘోరం చేస్తుందని అనుకో లేదయ్యా. వొరే వినోద్ - ఎప్పటికప్పుడు కొత్తతరం ఈ దౌర్భాగ్యాలకు ఫుల్‌స్టాఫ్ పెడుతుందని యువత మీద ఆశలు పెట్టుకుంటూ వచ్చాం కాని మీది చచ్చు తరంరా. ఈ రోజు శిరీష చచ్చిన దిక్కులేని చావుకు ఏ ఒక్కరినో తప్పు పట్టలేమురా. ఈ పాపంలో మీ అందరికీ భాగం వుంది. దీనికి మీరందరూ జవాబు చెప్పాలిరా" అంటూ తనూ దుఃఖం ఆపుకోలేక ఏడ్వడం మొదలపెట్టాడు జగదీశ్వర్రావు.

■